# నిశ్శబ్దం

కొరుకొండ సత్యానంద్



**దూరంనుండి** కారు రావడం చూసి వాచ్‌మన్ గేటు తీశాడు. కారు రయ్‌మని దూసుకుంటూ వచ్చి పోర్టికోలో ఆగింది. డ్రైవరు బయటకు వచ్చి బాక్ డోర్ తీసేంతలో ఆమె తలుపు తీసుకొని బయటకు వచ్చి గబగబా అడుగులు వేసుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది.

వెనుక తల్లి దిగుతూ ఏదో అన్నా, ఆమెకు ఆ మాటలు వినిపించలేదు. ఉద్వేగంతో, ఆవేశంతో, బరువెక్కిన గుండెతో వడివడిగా మేడ మెట్లెక్కి తన గదిని చేరుకుంది. వెనుక పరుగెత్తుకొచ్చిన చెల్లెలు "ఏమయిందక్కా?" అని అడిగింది.

బాధ గొంతుకడ్డం పడి మాట పెగలక పోయినా, అతి కష్టంమీద "తల నెప్పిగా ఉంది. లెట్ మీ రిలాక్స్!" అని తలుపు వేసుకొని లోపలకు వెళ్ళిపోయింది.

ఖరీదైన ఆ గది దేదీప్యమైన కాంతితో వెన్నెల గదిలా ఉంది.

ఆమె ఆ వెలుతురులో ఉండలేక లైట్లన్నీ ఆర్పేసింది. ఆలోచనల్ని వెక్కిరిస్తున్న చీకటి వెలుతురును సహించలేక పోతూంది. ఫాను వేసుకొని మెత్తని పరుపుమీద బరువుగా వాలిపోయింది.

ఆమెకు మనసు స్థిమితంగా లేదు.

చికాగ్గా ప్రక్కకు తిరిగి ఒత్తిగిలి పడుకోవడంలో ఆమె చేయి స్విచ్‌మీద పడి బెడ్‌లైటు వెలిగింది. సన్నని వెలుగు ఆ ప్రదేశాన్ని బలహీనంగా ఆవరించింది.

చిక్కని చీకటి గదిలో ఆ సన్నని వెలుగు కారులో తన మనసులో ఒక్కసారిగా తళుక్కుమన్న ఆలోచనలా అన్పించింది ఆమెకు.

చిన్నగా నవ్వుకుంది. ఆ నవ్వులో గూడు కట్టుకున్న బాధ ఉంది. ఆ బాధ ఇప్పుడిప్పుడే రగిలి పెద్ద జ్వాలగా మారింది.

ఇందాక కారులో తల్లితో, చెల్లితో నవ్వుతూ మాట్లాడుతున్న సమయంలో ఆమె మనసుమీద ఒక కొరడా దెబ్బ గట్టిగా తగిలింది.

ఆ దెబ్బకు విలవిలలాడిన మనసు పరిపరి విధాల ఆలోచించింది. ఆలోచనల సుడిగాలికి ఆమె వర్తమాన దీపం రెపరెపలాడిపోతూంది. మనసు ఏమిటా అని ఆ కొరడావైపు చూసింది.


అది కొరడా కాదు...గతం!

గతించిపోయిన కాలం తన కెదురుగా వచ్చి పకపకా నవ్వింది. ఫెళ్ళున చరిచింది. వెక్కిరించింది. వెటకారించింది.

విశాలి కనుకొలకుల్లో నిండిన నీరు నునుమెత్తని చెంపలమీదుగా జాలువారిపోయింది. ఆమె ముక్కు పుటా లదురుతున్నాయి. ఫాను స్పీడుగా తిరుగుతున్నా చెమట పడుతూంది. కళ్ళలో ఇందాకటి వరకూ ఉన్న ఆనందం కన్నీటిలో కరిగిపోయింది.

చెమరిన కళ్ళలో వేడి జ్వాలలు రగులుతున్నాయి.

ఆమె అసలు పేరు సీత. విశాలమైన కళ్ళున్నాయని, అవి చూసే చూపులు ప్రేక్షకుల గుండెల్ని ఝల్లుమనిపిస్తాయని మొదట 'విశాలాక్షి' అని పేరుపెట్టి, ఆ తర్వాత అది అందంగా లేదని 'విశాలి' అని పేరు మార్చింది సినీ పరిశ్రమ. విశాలమైన ఆ కళ్ళు ఎన్నో నిజాల్ని చూశాయి.




ఇన్నాళ్ళూ ఆ నిజాల్నే అసలైన నిజాలు అనుకుంది. అందుకే ఆమె మనసు కుంచించుకుపోయింది.

'నే నెక్కడికి వెళ్ళిపోతున్నాను? ఎంతకు దిగజారిపోతున్నాను?' అని తనను తనే ప్రశ్నించుకుంది. కానీ జవాబుగా పెద్ద నవ్వు విన్పించింది. అది అంతరాత్మ నవ్విన విపరీత వింత వికటాట్టహాసం.

'నువ్వెదిగిపోతున్నావు. ఎంతో ఎత్తుకు ఎదిగిపోతున్నావుకదూ? దానికి రుజువు నీ మెడ నలంకరించిన లెక్కలేనన్ని దండలు. నీ తలమీద ఉంచిన ఖరీదైన కిరీటం. నీ కిచ్చిన అందమైన బిరుదు. అప్పుడు నీ కంటి చూపులో తళుక్కుమన్న వింత వెలుగు. అవునా?'

లేదు...లేదు...నేను ఎదగడం లేదు.

మరి? దిగజారిపోతున్నావా?

ఏమో !?

అంతర్మాత నవ్వింది. నువ్వు ఎదిగిపోతూ దిగజారిపోతున్నావు. దిగజారిపోతూ ఎదిగిపోతున్నావు.

అదేమిటి?

అది అంతే ! నువ్వు విశాలిగా ఎదుగుతున్నావు. సీతగా దిగజారిపోతున్నావు. ఆ పేరు నీ అందమైన శరీరానికి పెట్టిన పేరు. కాలంతో వడిలిపోయే శరీరంతో పాటు ఆ అందమైన పేరు కూడా మాసిపోతుంది. అప్పుడు నీకు మిగిలిం దేమిటి?

ప్లీజ్ ! స్టాప్ దట్ నాన్‌సెన్స్! ఆమె గుండె ఆవేశంతో ఎగసిపడుతూంది.

ఒకే...ఒకే ! బట్ ఇటీజ్ నాట్ నాన్‌సెన్స్... ఇటీజ్ ఫుల్ ఆఫ్ సెన్స్ !

అఫ్‌కోర్స్, నన్నిలా ఉండనీ. లెట్ మీ లివ్ ఫ్రీలీ.

నన్నంటే బెదరించి, అణగద్రొక్కి వదిలించుకోగలవ్! కానీ గతం మాటేమిటి? నీ నటనా కౌశలానికి అభిషేకం చేసి, పూలమాలలతో అలంకరించి, మరో నకిలీపేరును తగిలించినంత మాత్రాన గతం నీకు హితంగా మారిపోతుందా?

మనిషి అందుకోలేనిది పారిపోయిన క్షణాన్ని... మార్చుకోలేనిది, మరచిపోలేనిది గతాన్ని!

ఓ..అయితే నువ్వంటున్న దేమిటి? చిరాకు పడిం దామె.

మనిషి ఎన్ని రకాలుగా మాట్లాడినా, నేను మాత్రం ఎప్పుడూ ఒకలాగే మాట్లాడతాను... కానీ, మనిషి నా మాటలు కొన్నింటిని విన్పించుకోడు. గతాన్ని ఒక్కసారి గుర్తు తెచ్చుకో. ఇప్పటి స్థితిని బేరీజు వేసుకో...అప్పుడు నీకు మిగిలేది అంతులేని ఆనందం. కానీ, నీ స్థితిని, రజతోత్సవం జరుపుకున్న నువ్వు నటించిన చిత్రంలోని నీ పాత్రను ఒక్కసారి బేరీజు వేసుకో. అప్పుడు నీకు మిగిలేది...?

విశాలి ఎంత ప్రయత్నించినా ఏడుపు నాపుకోలేకపోయింది... భోరున ఏడ్చింది.

"అదే...అదే...నీకు మిగిలేద దే!"

ఎందుకు నన్నిలా ఏడిపిస్తున్నావ్?

"నే నేడిపించడం లేదు... నిజం చెప్తుంటే నీకు ఏడుపొస్తూంది. అవునా? గతంతో నీ మనసు వేసుకున్న ముడిని భవిష్యత్తులో ఆలోచించి విప్పుకో! నిజమైన తృప్తి మిగుల్తుంది."

విశాలికి పిచ్చెత్తి పోతూంది. ఆమె మనసుకు సుందరి కన్పిస్తూంది.

సీత, విశాలి, సుందరి ముగ్గురూ, ఒక్కటే. కాకపోతే మొదటిది నిజం—రెండవది అబద్ధం, శాశ్వతం—మూడవది నటన. సుందరి పాత్ర విశాలికి ఒక అందమైన స్థానాన్ని ప్రసాదించింది.

సుందరి ఒక వేశ్య. మరి నువ్వో?

నేనా? ఏమిటి నువ్వంటున్నది? కంగారు పడింది విశాలి.

నే ననేది నిజాన్ని... నీకు గుర్తున్నా, పట్టించుకొని నిజాన్ని... నువ్వు నన్ను మోసం చేయలేవు. నోరు నొక్కేయగలవు. అంతే! నిజంగా నువ్వు శీలవతివా? చెప్పలేవు. అది నాకు తెలుసు. ఎందుకంటే నువ్వు శీలవతివి కాదు గనక.

విశాలికి గొంతు పట్టేసింది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి.

సుందరి పాత్రను నువ్వు చక్కగా నటించావు. సారీ, నువ్వు నటించలేదు. ఆ పాత్రలో జీవించావు. అందుకే ఆ పాత్రకు ప్రాణం వచ్చింది. కానీ, ఆ సుందరి ఏం చేసింది?

నీలా తలెత్తుకు తిరగలేదు. సమాజం ఆమెనెలా ఆటాడించింది? మరి నిన్ను? మెచ్చుకుంటుంది. నిన్ను చూసి పొంగిపోయి పొగిడేస్తుంది. ఎందుకీ తేడా? ఒక్కసారి ఆలోచించు నిజానికి నువ్వెంత పవిత్రమైన దానివో!?

నీ తోటి నటీమణుల సంగతి నాకు తెలీదు. కానీ నీ గురించి మాత్రం నాకు పూర్తిగా తెలుసు. కారణం—నేను నీ అంతరాత్మను. ఇన్నాళ్ళు నా నోరు నొక్కేశావు. గతం కొరడాను పట్టుకొని కాచుకూర్చున్న నాకు ఇప్పుడు బలం, అవకాశం వచ్చాయి.

నాకు తెలుసు, నువ్వు భారత స్త్రీవి. కానీ అసలైన భారత స్త్రీవి కాదు. అందుకే నీకు శీలం లేదు. నీకు, సుందరికి తేడా ఏమీ లేదు.

విశాలి ఏదో అనబోయింది.

ఉష్! మాట్లాడకు. నువ్వేమీ చెప్పకు. నా ప్రశ్నకు సూటిగా సమాధానం కావాలి. చెప్పు! ఏ తేడా లేకపోతే సుందరి జీవితం ఎందుకు అలా గడిచింది? నీకెందు కిలా గడుస్తుంది? ఎప్పటికైనా నువ్వేసుకున్నా ముసుగే నీ పీక నులిమేస్తుంది. అది తప్పదు! గడించింది చాలు... నీ జీవితానికి అర్థం, పరమార్థం చూసుకో!

అవి దొరకనేమోనని అనుమానంగా ఉందా? వద్దు. అనుమానించద్దు. ప్రయత్నించు. మనః స్ఫూర్తిగా ప్రయత్నించు. నీకు నేను తోడుంటాముగా! నా మాటతో ఏకీభవించు.

విశాలి నిట్టూర్చింది—కొండంత బరువు ఉంది ఆ నిట్టూర్పులో.

సుందరి సృష్టించిన పాత్ర—ఆఖర్న ఆమెకు కలిగిన అదృష్టం...కల్పించిన అదృష్టం...నిజ జీవితంలో అలా జరుగుతాయా?

దేవుడు రాసినంత అందంగా, వింతగా మనిషి రాయులేడు.

ఏమో! నాకేదో అన్పిస్తుంది.

అలాగే ఉంటుంది. ఊహించిన మలుపు కావాలని తిరుగుదామనుకుంటే అనుమానంగానే ఉంటుంది. కానీ ఆ అనుమానం నీకొద్దు. నీతోడు నే నున్నాగా!

అయితే నేనేం చేయాలి? సరిగ్గా చెప్పు!

ఏముంది? ప్రయత్నిస్తే సుందరికి దొరికిన రామారావు నీకూ దొరక్కపోడు. నాకెందుకు అవకాశం ఇచ్చావో ఇచ్చావు. ఇంక ఆలోచించకు. నీ జీవితం వైపు చూస్తుంటే నాకు బురద గుంట గుర్తుకొస్తుంది. పరిసరాలు, నీ పరిచయాలు చూస్తుంటే అవన్నింటిలోనూ ఏదో కృత్రిమత్వం కన్పిస్తుంది. ఆకర్షణ, కామం నిండిన కళ్ళే కన్పిస్తున్నాయి.

వద్దు. ఇంక ఆపెయ్!

ఏం? నే చెప్తుంది తప్పా? అబద్ధమా? నీ తండ్రి నేర్పిన నాట్యం, సంగీతంతో నీకు కళ

మీద మోజు ఏర్పడింది. తండ్రి పోయి నీ కుటుంబానికి దిక్కు లేకపోతే అవే ఆధారమయ్యాయి. ఒక పెద్ద మనిషి చేత ప్రోగ్రాములు సంపాదించే దానివి. వాడు పెద్ద మనిషా? మొదటిసారిగా నిన్ను సంభవించింది వాడు కదూ?! నీ అందాన్ని ఆరాధించావని, నీ మనసును ప్రేమించావని చెప్పి ఎవ్వరికీ అంతవరకూ అందని నిన్ను వాడుకున్నాడు. నువ్వు ఏదో పోగొట్టుకుంటున్నావని, దాని పేరు శీలం అని నీకు తెలీదు. వాడి మత్తు మాటల్లో పడి ఆ విషయాన్ని మరిచిపోయావు. అన్ని లంచాల కంటె ఖరీదైన లంచం శీలం. సినిమా అంటే చాలా మందికి ఉండే మోజే నిన్ను మళ్ళీ మళ్ళీ మళ్ళీ ఆ దారిలోకి నడిపించింది. మోజు, అవసరం, బతుకు, నీ తల్లిమాటలు, ప్రోత్సాహం నిన్ను 'శీలం' అనే విషయం గురించి ఆలోచించనీయలేదు. ఫలితంగా సినిమా చాన్సు దొరికింది. కానీ, నువ్వు ఫలితం దక్కించుకున్నావు. నీలోని కళ నిన్ను మంచి నటిగా నిలబెట్టింది. ఈ దారిలో నీ కెంతమంది 'పెద్దమనుషులు' తారసపడకపోతే నీ కీ స్థితి వచ్చిందో నాకు తెలీదా?

నీకు తెలియని విషయం ఒకటి చెప్పనా? నీ జీవితం వైకుంఠపాళీ ఆట. సీతను పాము మింగేస్తుంటే విశాలి నిచ్చెన ఎక్కేస్తుంది. అవునా?

కానీ అది మాయ నిచ్చెన. నువ్వెక్కిన ప్రతి మెట్టూ నువ్వు తరువాత మెట్టు ఎక్కేసరికి మాయమైపోతుంది. ఆఖరుకు మిగిలేది అంధకారంలో ఒకే ఒక మెట్టు. ఆఖరి పై మెట్టు...అదీ మాయమైపోతే?

నువ్వెక్కడికి పడిపోతావ్!?

గజగజా వణికి పోయింది విశాలి.

చూశావా? భవిష్యత్తు గురించి చెప్తుంటే నువ్వెంతగా చలించి పోతున్నావో? అందుకే నేను చెప్పినట్టు చెయ్యి!

"ఇన్నాళ్ళూ నువ్వేం చేశావు? ఏమైపోయావు?"

"నే నెప్పుడూ నీతోనే ఉన్నాను. నువ్వే ఈ లోకంలో లేవు. మనిషి తన క్కావాల్సింది ఏమిటో తెలుసుకోకుండా, దేనికోసమో అర్రులు చాచుతుంటే, ఆ మిథ్యాలోకంలో అందమైన భవిష్యత్తు ఉందనుకుంటే అతనికి అంతరాత్మ కన్పించదు. దాని మాటలు విన్పించవు. ఎన్నాళ్ళనుండో ప్రయత్నిస్తేగానీ, ఈ రోజుకు నా మాటలు నీకు విన్పించలేదు. అందుకే మళ్ళీ మనస్సు మార్చుకోకుండా నీ భవిష్యత్తు గురించి సరైన నిర్ణయం తీసుకో!"

విశాలి అలసిపోయింది. ఆలోచనలన్నీ కలిసి ఆమె కో నిర్ధారణను తయారు చేశాయి.

బెడ్‌లైటు ఆర్పేసి రాని నిద్రకోసం ప్రయత్నించింది విశాలి.

• • • •

చాలా సేపటినుండి అద్దం ముందు కూర్చుంది విశాలి. ఇప్పు డామె తన అందమైన అధరాలను గానీ, ముద్దొచ్చే చెంపల్నిగానీ, ఆకర్షణీయంగా ఉండే కనుబొమలను గానీ, కళ్ళలోని కాంతుల్ని గానీ చూసుకోవడం లేదు. అయోమయంగా, అదోలా ఎటో చూస్తుండిపోయింది. ఆ చూపు తన మారిన మనసువైపు. ఆ చూపులో ఏదో క్రొత్తదనం ఉంది. ఇప్పు డామె ముఖంలో భావాలు రాత్రి తనకు, అంతరాత్మకు జరిగిన పోరాటానికి అద్దం చూపెడుతున్నట్లుగా ఉన్నాయి.

చెల్లెలు లక్ష్మి వచ్చి "అక్కా! ఇవిగో...నిన్న మధ్యాహ్నం వచ్చిన ఉత్తరాల్లో ఉన్నాయి. వాళ్ళిద్దరూ నీకు శుభాకాంక్షలు వ్రాశారు నీ సన్మానం సందర్భంగా" అని రెండు కవర్లను విశాలికి అందించింది.

"అక్కడ పెట్టు. నువ్వెళ్ళి చదువుకో." నెమ్మదిగా అంది విశాలి. లక్ష్మి వెళ్ళిపోయింది.

ఆమె ఆ ఉత్తరాల వైపు చూసింది. అవి ఫాను గాలికి కదిలాయి చిన్నగా. ఆ కదలికలో ఏవో అర్థాలు, మాటలు విన్పించాయి విశాలికి.

ఒక ఉత్తరాన్ని తీసింది. కవర్ని విప్పి లోపలున్న




గ్రీటింగ్‌ను, ముత్యాల్లాంటి అక్షరాలున్న కాగితాన్ని తీసింది. గ్రీటింగ్ మీద అందమైన పాలరాతి విగ్రహం బొమ్మ. క్రింద 'విశాలి' అని వ్రాసి ఉంది. ఇది క్రొత్త కాదు. ఎప్పుడూ అదే బొమ్మ ఉన్న గ్రీటింగ్ కార్డును ప్రత్యేకంగా పంపుతాడు కిరన్.

అంటే నేను అందాల బొమ్మననా? ప్రాణం లేని విగ్రహాన్ననా? ఆ గ్రీటింగ్ వైపు చూస్తూ అనుకుంది విశాలి. ఆమె ఎప్పుడూ అలా అనుకోలేదు. ఇదే మొదటిసారి అలా అనుకోవడం. గ్రీటింగ్ త్రిప్పి చూస్తే "శుభాకాంక్షలతో... కిరన్" అని వ్రాసి ఉంది.

ఆ కాగితం మడత విప్పి చదివింది.

ప్రియమైన 'విశాలి' గార్కి...

మొదట మీ సన్మానం గురించి విని చాలా సంతోషపడ్డాను. మీరు ఆ విషయం వ్రాశాక ఎగిరి గెంతేశాను. మీ నటనకు అసలైన గుర్తింపు వచ్చిందంటే నాకు ఎంత సంతోషం కలిగిందో తెలుసాండీ? ముందుగా గ్రీటింగ్ పంపాను. వీలైతే వస్తాను. వీలైతే ఏమిటి? తప్పకుండా వస్తాను. మిమ్మల్ని కలుసుకుంటాను... ఉంటాను.

మీ నటనాభిమాని, ఆరాధకుడు
—కిరన్.

ఆ ఉత్తరాన్ని మళ్ళీ ఒకసారి చదివింది.

ఈయన వస్తానన్నారు. వీలుకాక రాలేదేమో!? అని అనుకుంది.

ఆ రోజు—

గులాబి తోటలో కుర్చీ వేసుకుని ఏదో పుస్తకం చదువుతూంది విశాలి. అంతలో వాచ్‌మన్ వచ్చి "అమ్మా! మీకోసం ఎవరో వచ్చారు. మీరు కన్పిస్తుండడంతో లేరని అబద్ధం ఆడేందుకు కుదరలేదు. ఆయన ఎంత వీల్లేదన్నా మిమ్మల్ని కలవాలంటున్నాడు" అన్నాడు.

విశాలి ఒక నిముషం ఆలోచించి "సరే, పంపించు" అంది.

అయిదు నిముషాల్లో ఒకతను లాన్‌లోకి వచ్చాడు—"నమస్కారమండి" అంటూ.

విశాలి తలెత్తి చూసింది.

తెల్లని పాంటు, నేవీ బ్లూ షర్టు టక్‌చేసి, అందమైన కళ్ళద్దాల్లోంచి నవ్వుతూన్నట్లుగా ఉన్న కళ్ళతో అందంగా కన్పిస్తున్నాడు ఆ యువకుడు.

"రండి...కూర్చోండి" అని కుర్చీ చూపించింది విశాలి.

"మాది విజయవాడ. నా పేరు కిరన్. బ్యాంక్‌లో పని చేస్తున్నాను. మద్రాసు పనిమీద వచ్చాను. నేను మీ అభిమానిని. మీ నటనంటే నాకెంతో ఇష్టం!" అన్నాడు అతను కూర్చున్న వెంటనే.

"థాంక్స్!"

"నో మెన్షన్. కానీ, మీ సినిమా తారలకు గొప్ప గర్వమండి."

వింతగా చూసింది విశాలి.

"అవునండి...అభిమానులు ఎంతగా అమెను ఆరాధిస్తారో...చూడాలని ఎంతగా ఆశపడతారో ఆలోచించకుండా ఉండి లేనని చెప్పించు కుంటారు."

"అదేమిటండీ! నే నలా చేయలేదుగా!"

"అఫ్‌కోర్స్! మీ రలా చేయలేదనుకోండి. కానీ, మీరు కన్పించకపోతే మీ వాచ్‌మన్ అలా చెప్పేవాడేగా?"

విశాలి నవ్వింది చిన్నగా.

"మీరు చాలా బాగా నటిస్తారనుకున్నాను. పైన కూడా చాలా బాగా నవ్వుతున్నారండీ."

విశాలి ఏమీ మాట్లాడలేదు ఆ మాటకు. అతను మాట్లాడడం ఆపలేదు.

"విశాలిగారూ! నేను మిమ్మల్ని ఎంతగా లైక్ చేస్తున్నానో తెలుసాండీ!"

"తెలీదు...ఎంత?"

"మీరేమీ అనుకోనంటే చెప్తాను."

"చెప్పండి."

"తర్వాత చెప్తాను లెండి...కానీ, మీరు నా కో మాటివ్వాలి."

"ఏమిటది?"

"మీకు నేను ఎన్నో ఉత్తరాలు వ్రాశాను. అఫ్‌కోర్స్, రెండు మూడింటికి రిప్లై ఇచ్చారను కోండి. కానీ, అది మీరు వ్రాయలేదని నే నను కుంటున్నాను. ఈసారి నా ఉత్తరాలకు జవాబు మీరే వ్రాస్తే నే నెంతో ఆనందిస్తాను. మనిషి లోని భావాలు ఉట్టిపడేలా నటించే మీరు ఈ అభిమాని ఆశల్ని, మనసుని అర్థం చేసుకుంటా రని అనుకుంటున్నాను."

ఇంకా ఏవో చెప్తున్నాడు కిరణ్. ఇతను ఎంత చక్కగా మాట్లాడుతున్నాడు? నేచురల్‌గా, అద్భుత మైన నటుడిలా మాట్లాడుతున్నాడు. హుందా తనం, సంస్కారం ఉట్టిపడుతున్నాయి. మనిషి డబ్బున్నవాడిలాగే కన్పిస్తున్నాడు అనుకుంది విశాలి.

కిరణ్ రెండు మూడుసార్లు చెప్పాడు. మా వూరు షూటింగ్ అయితే మీరు తెలియబరచాలని, మాకు చాలా ఆస్తి, పెద్ద పెద్ద బిల్డింగ్స్, గెస్ట్ హౌస్ ఉన్నాయని, మీరు మా వూరు వస్తే మా బిల్డింగ్‌లోనే ఉండాలని, ప్రతి లెటరుకూ రిప్లై ఇవ్వాలని మరీ మరీ చెప్పాడు.

చాలాసేపు ఎంతో అభిమానంగా మాట్లాడి 'వెళ్ళొస్తానండి' అన్నాడు.

విశాలి తోటమాలితో చెప్పి కాఫీ తెమ్మంది. కాఫీ త్రాగాక వస్తానని లేచాడు.

"మంచిది. ఆఁ...ఇందాక నన్ను మీరు ఎంతో లైక్ చేస్తున్నానంటున్నారు. ఎంత?"

"చెప్పమంటారా? కానీ నటించే మీరు అది నిజం కాదనుకుంటారేమో!" అతని ముఖంలో చప్పున మారిన భావం విశాలి గమనించింది.

కానీ ఇంతదూరం వచ్చింది, నేను వ్రాసిన ఉత్తరాల్లోని మీరు పట్టించుకోని విషయాల్ని నా నోటితో స్వయంగా చెప్పాలని. నేను మిమ్మల్ని లవ్ చేస్తున్నంతగా లైక్ చేస్తున్నాను. మీకు ఇష్టం లేకపోయినా, నేనంటే అయిష్టంగా ఉండరని ఆశిస్తున్నాను" అని అక్కడినుండి చకచకా నడిచి వెళ్ళిపోయాడు.

విశాలి వెళ్ళిపోతున్న అతనివైపు వింతగా చూస్తూ ఉండిపోయింది.

కానీ ఆమెకు అప్పుడు చిన్నగా నవ్వొచ్చింది—'పిచ్చివాడు' అనుకుంది.

ఆ విషయం గుర్తుకు తెచ్చుకుంటే ఇప్పు డామెకు నవ్వు రాలేదు. ఆశ కలుగుతుంది. నటించిన ప్రేమ లెన్నో చూసిన ఆమెకు ఇప్పుడు అతని ప్రేమ నిజమైనదని అన్పిస్తుంది. తన ఆశ నిజమవుతుందని దృఢంగా అనుకుంటుంది.

ఎదురుగా ఉన్న రెండో ఉత్తరాన్ని తీసింది విశాలి. అది చైతన్య వ్రాసిన ఉత్తరం.

కిరణ్, చైతన్య—ఇద్దరూ రెండు విధాలుగా ఉన్నా ఇద్దరూ నన్నెందుకో ఆకర్షించారు. కిరణ్ మాటలు సూటిగా ఉంటే, చైతన్య మాటలు అదోలా ఉంటాయి. అయినా ఇద్దరూ తనకు గుర్తుండి పోయారు. ఇద్దరి ఉత్తరాల్ని చదవడ మన్నా నాకెంతో సరదా. ఇష్టం!

అప్పటికి నే నింకా సుందరి పాత్రను ధరించ లేదు. కానీ, కొన్ని సినిమాల్లో కథానాయికగా నటించి కొద్దిగా పేరు తెచ్చుకున్నాను. ఖాళీ ఉండేది కాదుగానీ, ఇప్పట్లా విశ్రాంతి లేకుండా మాత్రం ఉండేది కాదు.

కొంతమంది నటీనటులతో షిప్‌యార్డ్ కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో ఒకరోజు నాటకం వేయడానికి వెళ్ళాను. ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలు విశ్రాంతి. నాకు ఆ సమయంలో నిద్రపోవడం అలవాటు లేదు. గెస్ట్‌హౌస్ కిటికీ లోంచి చూస్తుంటే కొద్ది దూరంలో కొండమీద ఒక గుడి కన్పించింది. ఆ గుడి ముందున్న ధ్వజ స్తంభం బట్టి అది శివాలయం అనుకున్నాను.

మిగిలిన వాళ్ళందరూ నిద్రపోయారు. నాకు ఆ గుడిదగ్గరకు వెళ్ళాలన్పించి లేచాను.

ఒంటరిగా వెళ్ళడం నాకు సరదా. ఎవరైనా నన్ను చూస్తారని, గుర్తుపడతారని నాకు భయం లేదు. ఎందుకంటే అభిమానులు అడిగే ప్రశ్నలకు జవాబిచ్చే ఓపిక, సరదా నా కుంది. అయినా ఆ ప్రదేశం నిర్మానుష్యంగా కన్పిస్తుంది.

అయిదు నిముషాల్లో తయారై అటు వైపుకు దారి తీశాను.

కొద్ది కొద్దిగా ఎత్తు పెరుగుతూ ఉంది కొండమీదకు వెళ్ళే తారురోడ్డు... ఆ దారికి దూరంగా అందమైన కంపెనీ క్వార్టర్సు. దూరంగా ఉన్న పెద్ద కొండల్ని, చుట్టుప్రక్కల ప్రదేశాల్ని చూస్తూ పదిహేను నిముషాల్లో కొండమీదకు చేరుకున్నాను. చిన్నగా చెమట పట్టింది. గుడి ఉన్న కొండ ఎక్కేసరికి.

'హమ్మయ్య!' అనుకొని గుడి దగ్గరకు వెళ్ళాను. కానీ గుడి తలుపులు మూసేసి ఉన్నాయి. నాకు నీరసం వచ్చేసింది.

కానీ, చల్లగాలికి హాయిగా ఉం దక్కడ. చుట్టూ కొండలు... ఒక కొండమీద నుండి పాములా మెలికలు తిరిగిన సిమెంటు రోడ్డు పైవరకూ ఉంది.

అంతలో నాకు అక్కడ గుడి శివతం అరుగు మీద ఒక యువకుడు కన్పించాడు. తెల్లబట్టలు వేసుకొని,కళ్ళద్దాలు పెట్టుకొని కూర్చొని ఏదో వ్రాసుకుంటున్నాడు.

నేను ఒక నిముషం ఆలోచించి నెమ్మదిగా అతని దగ్గరకు వెళ్ళాను.

"ఏమండీ!" అని పిలిచాను.

అతను చటుక్కున తలెత్తి చూశాడు.


"గుడి తలుపులు ఎన్ని గంటలకు తీస్తారు?" అని అడిగాను గానీ, అతను నా మాట విననట్లుగా నావైపు వింతగా, ఆశ్చర్యంగా చూశాడు.


"మీరు...మీరు...నటి విశాలి కదూ!?"

నేను చిన్నగా నవ్వి "అవును" అన్నాను.

అతను మరింత సంతోషంతో, ఆశ్చర్యంతో "మరి..." అని ఏదో అనబోయాడు.

"ఇలా వచ్చానేమిటా అని ఆశ్చర్యపోతున్నారా?






మీకు తెలీదా—ఇక్కడ కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో ఈరోజు మరికొంత మంది నటీ నటులతో కలిసి నాటకం వేస్తున్నాను.''

"అలాగా? అటువంటి వాటితో నాకు సంబంధం ఉండదులెండి.''

అతని ఆ సమాధానం విన్నాక అతని గురించి తెలుసుకోవాలన్పించిం దెందుకో.

"ఎందుకండి?''

"నేను బీదవాణ్ని కనుక ...''

నే నతని వైపు వింతగా చూశాను. అతను తేరుకున్నట్లుగా ... "నా గురించి ఎందుకు గానీ, మీ రిలా కూర్చుంటారా?'' అని లేచి నిలబడి ప్రక్క అరుగుమీద అతను కూర్చున్నాడు.

నాకూ కూర్చోవా లనిపించింది.

"మీ రొక్కరే వచ్చారు— భయం వేయులేదా?''

"భయం ఎందుకు ... నే నంత పెద్ద నటిని కాదు లెండి.''

"అహా... అలా అనకండి. మీరు చాలా బాగా నటిస్తారు. మీ నటన నాకు నచ్చుతుంది.''

"అలాగా? థాంక్యూ... అవునూ, మీ రేం వ్రాస్తున్నారు? నేను చూడచ్చా?''

"ఎందుకు చూడగూడదు? కానీ, పిచ్చివాడి కింద జమకడతా రేమో?!''

"భలేవారే! అలా అంటా రేమిటి? చూడ నివ్వండి—ఏదో కథ లాగుంది.''

"కథ కాదు ... బాధ ... ఏదోటి రాసుకోవడం నాకు అలవాటు.''

ఆ మాట అతను ఆదోలా అన్నాడు. ందుకే నేమో అది చూడాలని అన్పించింది నాకు.

"నేను చూడగూడ దంటారా అయితే?''

తను కాదనలేకపోయాడేమో, తెరిచి ఉన్న పుస్తకాన్ని నా కందించాడు.

ఆ పేజీలో... "ఆందోళన అనే భూతద్దంలోంచి పరిస్థితుల్ని చూస్తే అవి మనకు రాక్షసుల్లా కన్పించి మనల్ని భయపెడతాయి. భయపడ్డం మనిషి బలహీనత. కానీ ఇది కొన్ని పరిస్థితుల్లో అతని మనుగడకే పెద్ద ఆటంకం కావచ్చు ...'' అని ఇంకా ఏదో వ్రాసి ఉంది.

మధ్యలో "నోటికొచ్చింది రాయడం నా బలహీనత. ఆ బలహీనతనే నేను తృప్తి అనుకొని సంతృప్తి పడతాను...'' అని అన్నాడు.

నే నతనివైపు చూశాను వింతగా. నే నో నటినని, అతనెవరో అని నా కప్పుడు అన్పించలేదు. అతని కంఠం, అతని రూపం చూస్తుంటే నా కేదో క్రొత్తగా, వింతగా అన్పించా యప్పుడు.

"మీరు చాలా బాగా మాట్లాడతారండి. ఎక్కడ ఉద్యోగం చేస్తున్నారు? ఏదైనా పత్రికాఫీసు లోనా?''

అతను నవ్వలేదు. "నాకు ఉద్యోగం దొరకలేదు.''

నా కేమనాలో అర్థం కాలేదు. అతనే మళ్ళీ అన్నాడు:

"వెట్టిచాకిరీలో నా జీవితాన్ని వెళ్ళబుచ్చు తున్నాను.''

ప్రశ్నార్థకంగా చూశా నతనివైపు. అది గమనించి "మీ కీ భాష అర్థం కాదులెండి. సూటిగా చెప్తాను. ప్రైవేటుగా ఒక చోట పని చేస్తున్నాను. చెప్పింది చేయడం, ఇచ్చింది పుచ్చుకోవడమే గానీ, ఇంతే చేయగలను, ఇంతవరకే చేయగలను, మీ రిచ్చేది నాకు చాలదు అని అనలేను నేను ... అందుకే దాన్ని వెట్టి చాకిరీ అని అన్నాను. ఈ ఆదివారం మీ కోసమే సెలవిచ్చాడేమో మా యజమాని!''

అతని పరిస్థితి కొంచెం కొంచెంగా అర్థమవుతూంది నాకు. ఇంకా తెలుసుకోవా లన్పించింది ఎందుకో!

అడిగితే చెప్పాడు బాధ్యత లెక్కువ ఉన్న మనిషి. అభిమానం కాస్త ఎక్కువ! కానీ, అతని పరిస్థితులు అతని అభిమానానికి ఉన్న పౌరుషాన్ని తగ్గించేశాయి. అంతమాత్రాన నేను మనసును చంపుకోలేను...'' అని చెప్పాడు.

అతని మాటల్లోని పదాల పొందిక చమత్కారంగా, ఆకర్షణగా ఉన్నాయి.

"మీ కింకా పెళ్ళి కాలేదా?''

"లేదు ... అందుకే బ్రతకగలుగుతున్నాను. అయినా నా కా అదృష్టం లేదేమో?!''

"ఏం? ఎందు కలా పెళ్ళంటే నిరాశగా మాట్లాడుతున్నారు?''

"పోషించే శక్తి లేదు కనుక.''

"అంతేనా, లేక ఎవరినైనా ప్రేమించారా?''

ఆ మాటకు అతను మొదటి సారిగా నవ్వాడు... అదోలా!

"మీది సినిమా జీవితం. మాది నిజమైన జీవితం. ప్రేమకు ఎన్నో అర్హత లుండాలి.''

"మీ రదోలా మాట్లాడుతున్నారు.''

"అవును, పిచ్చిగా మాట్లాడుతున్నాను కదూ?! అవును, నేను పిచ్చివాణ్నే. అందుకే ఖాళీ ఉన్న ప్రతి నిముషం ఒంటరిగా కూర్చొని ఏదో గెలుకుతూ ఉంటాను. గదమాయించే వారే గానీ, అభినందించే వారు లేరు. ఆధారపడేవారే గానీ, ఆదుకునేవారు లేరు నాకు. ప్రేమ గురించి అడిగారు కాబట్టి చెప్తున్నాను. ఆ ముందు పేజీ తీసి పై నున్న రెండు లైన్లు చదవండి...''

నేను ఆ పేజీ త్రిప్పి పై రెండు లైన్లూ పైకి చదివాను.

పేదవాడి కోపం పెదవికి చేటు....బీదవాడి ప్రేమ చెంపకు చేటు.

"ఇదేమిటి?''

"అది నా అభిప్రాయం. ఈ పిచ్చివాడికి వ్యంగ్యం అంటే కాస్త మక్కువ. నేను ప్రేమించేది కళను, కళాకారుల్ని. నటన అంటే నాకు ప్రత్యేక ప్రేమ. నటించే వాళ్ళంటే ఎంతో ప్రేమ.''

"అంటే?''

"కంగారు పడకండి. మంచి నటన నా కెంతో ఇష్టం. అందులోనూ నాకున్న పిచ్చితనమే ఉన్న పాత్రలంటే మరీ ఇష్టం. మీ నటనలో ఆ పిచ్చితనం కన్పిస్తుంది. అందుకే మీ నటనన్నా నా కిష్టమే ! కానీ, నటనలో సంస్కారం నటించిన మనుష్యులకు ఉండడం లే దీ మధ్య !''

"ఎందుకలా అంటున్నారు?''

"నటన అద్భుతంగా ఉందని వ్రాసిన అభిమానుల ఉత్తరాల్ని చూసి నటులు నవ్వుకుంటారేమో! అందుకే ఏ నటుడూ, ఏ నటీ కూడా అభిమానులకు జవాబు వ్రాయరు.''

"మీకలా జరిగిందా? నే నెప్పుడైనా అలా చేశానా? చేస్తే ఇకమీద అలా చేయనులెండి— మీ పేరేమిటి?''


"ఎందుకు?''

"గుర్తు పెట్టుకొని జవాబు వ్రాయడానికి.''

"అభిమానమైన జవాబు నాకు కావాలి. అంతే గానీ మొక్కుబడికి ఇచ్చే జవాబు నా కిష్టం ఉండదు. అక్కర్లేదు కూడా! అయినా నే నెంత వాణ్నిలెండి?''

"ఆహా...అలా అనకండి. నేను కూడా కష్టాలు అనుభవించినదాన్నే ! మీ పేరు చెప్పండి.''

అతను చిన్న నిట్టూర్పు విడిచి "పేరుకు తగ్గ రూపం, పరిస్థితి ఉన్నవాణ్ని కాదు నేను. అందుకే నేను చెప్పలేను. ఆ పుస్తకంమీద ఉంది చూడండి.''




7—7—82

నేను పుస్తకం తిప్పి చూశాను. ముత్యాల్లాంటి అక్షరాల్తో "చైతన్యకుమార్... ఎమ్. ఎ." అని వ్రాసి ఉంది.

సినిమా పటి కన్పిస్తే రకరకాల ప్రశ్నల్తో ఉక్కిరి బిక్కిరి చేస్తారు చాలామంది. ఒకొక్కప్పుడు చాలా ఇబ్బంది పెడతారు. కానీ, ఇతను తాపీగా మామూలుగా మాట్లాడుతున్నాడు అనుకున్నాను.

అలా ప్రారంభమైన మా పరిచయం ఇంత వరకూ స్నేహంగా, అందంగా సాగింది. రాను రాను చైతన్య ఉత్తరాల్లో నా మీద ప్రేమ ఎంతో కన్పిస్తుంది. అందంగా, అర్థార్థహితంగా, వింతగా వ్రాస్తాడు ఉత్తరాలు.

తీవ్రయత్నంగా గతం గుర్తుకొచ్చాక ఆమె కళ్ళు ఉత్తరంలోని అక్షరాల మీద పడ్డాయి.

నమస్కారం !

మీ ఉత్తరం అందింది. హృదయపూర్వక శుభాకాంక్షలు... సన్మానం జరగడం మీ గొప్ప కాదు. అది మీ నటన కొచ్చిన విలువ, గుర్తింపు... మీకు బాధ్యత మరీ పెరిగింది. మీరింక అన్ని చిత్రాల్లోనూ నటించరనుకుంటాను. మీరు కళాత్మక విలువలున్న చిత్రాల్లోనే నటించాలని కోరుతున్నాను. ఎంతో ఎత్తుకు ఎదిగిన మీరు నాకు రిప్లై ఇవ్వడంలో అశ్రద్ధ చేయరుకదా? నేను బీదవాణ్ణి. ఆశలున్నా ఫలించే అదృష్టం లేనివాణ్ణి. అందుకే నేను మీ సన్మాన సభకు రాలేను. మన సన్మానం జరిగే సమయంలో నేనేం చేస్తానో తెలుసా? మీ నామ జపం చేసుకుంటూ, మీకు జరుగుతున్న వైభవాన్ని వూహించుకుంటూను. ఉంటాను!?

మీ నటనను, మిమ్మల్ని అభిమానించేవాడు... ప్రేమించేవాడు...

—చైతన్యకుమార్.

చ ! డబ్బు ఎక్కువైపోయిన నేను బీదవాడికి నబ్బెంత అవసరమో గుర్తించలేకపోయాను. ఇన్విటేషన్‌తోపాటు కాస్త డబ్బు పంపించి ఉండాల్సింది.

పోనీలే ! అతను అదృష్టవంతుడైతే....అతని మనసులోని ఆలోచనలుబట్టి అతని భవిష్యత్తు మారదా ? నామీద ప్రేమ నిజమైతే తన నిర్ణయమే తన భవిష్యత్తుకు బంగారు బాట వేయదా? అనుకుంది నిట్టూరుస్తూ.

చైతన్య ఎప్పుడూ కిరణ్‌కంటె పెద్ద ఉత్తరమే వ్రాస్తాడు. కిరణ్ ఎప్పుడూ గ్రీటింగ్ పంపుతూ ఉంటాడు.

ఇద్దరూ అభిమానిస్తారు. ఇద్దరూ ప్రేమిస్తారు. ఇద్దరూ చక్కగా మాట్లాడతారు. ఇద్దరూ అందంగా నవ్వుతారు. కానీ, ఒక్కటే తేడా. కిరణ్ డబ్బున్నవాడు—చైతన్య బీదవాడు.

డబ్బున్నవాణ్ణి నమ్మగూడదేమో!?

విశాలీ! పొరబడుతున్నావేమో!? డబ్బుకోసం ఆశపడ్డానికి కిరణ్‌కి డబ్బులేకపోలేదు. అతని లాపత్రయంలో నీమీద ప్రేమాభిమానాలు కన్పిస్తాయి గానీ, ఇతర ఆశలేవీ కన్పించవు. నీ అందం కోసం అనుకుంటే, అది పొరపాటు...కావాలంటే అతను తన కౌగిలిలోకి ఎంతమందినైనా కొనుక్కోగలడు.

మరి బీదవాడైన చైతన్య?

బీదవాళ్ళకు అసలైన ప్రేమ, మనసు ఉంటాయంటారుకదా? చైతన్య అలాంటివాడు కాక పోయినా కొంతమంది బీదవాళ్ళకు కేవలం డబ్బు మీదే ఆశ ఉంటుంది.

సరే...ఆ విషయాలు అలా ఉంచు. నేనేం చేయాలో చెప్పవుగానీ, ఎలా చేయాలో చెప్ప లేదు నువ్వు.

అదే నాకూ అర్థం కావడం లేదు.

ఆ .... అంతరాత్మ ఆలోచించింది—

"పోనీ, ఒక పని చెయ్!"

"ఏమిటది?"

● ● ● ●

ఈ అశాశ్వత, కృత్రిమ బంధాలను విడిచి, ఏదో ప్రేమబంధాన్ని పట్టుకుందామన్నా, కథ ఒక కొలిక్కి రాకుండా తీసుకున్న నిర్ణయాన్ని కార్యాచరణలో పెట్టగూడదనుకొని, పదిహేను రోజులు కాల్‌షీట్లను కాన్సిల్ చేసుకుంది విశాలి.

ఈ పది రోజుల్నుంచీ ఆమె ఎదురు చూస్తుంది చేరువవుతుందనుకుంటున్న జీవిత గమ్యం ఆహ్వానం కోసం. ఆమె కళ్ళలో ఎప్పుడూ కన్పించని వింత నిరీక్షణ కన్పిస్తుంది.

ఆ నిరీక్షణలో ఆమె ఆలోచనలు కిరణ్... చైతన్యల చుట్టూ సాగిపోతున్నాయి.

ఒకప్రక్క చైతన్య...మరో ప్రక్క కిరణ్... ఇద్దరూ నాకు నచ్చిన వాళ్ళు ! ఇద్దరూ నన్ను ప్రేమించేవారే !

నా నిర్ణయానికి ఆ ఇద్దరి జవాబూ ఎలా ఉంటుందో!? ఎవరు తమ అభిమానాన్ని నిజంగా నాకే సొంతం చేస్తారో !? ఒకవేళ ఇద్దరూ అంగీకరిస్తే ?

ఆ ఆలోచనకు విశాలి నవ్వుకుంది.

కిరణ్‌కంటె ముందు చైతన్య స్నేహం లభించినా, ఇద్దరూ నన్నెంతగానో ఆకర్షించారు. ఈ సినిమా పరిశ్రమలోని మనుష్యులు తప్ప- పైగా నా కెవ్వరితోనూ పరిచయం లేదు, ఒక్క కిరణ్, చైతన్యల స్నేహం, ప్రేమ, అభిమానాలు తప్ప ! వాళ్ళు నా దృష్టిలో నిజమైన మనుష్యుల్లా కన్పిస్తారెందుకో?

కిరణ్ హుందాగా ఉంటాడు. చైతన్య అదోలా, పూర్తిగా అర్థంకాని మాటల్తో విచిత్రంగా ఉంటాడు. కిరణ్ పరిచయం తర్వాత నాలుగైదుసార్లు వచ్చాడు. అప్పుడు పరిచయం అయిన తర్వాత చైతన్యను మళ్ళీ ఒక్కసారీ చూడలేదు తను. తనూ ఎప్పుడూ అతని దగ్గరకు వెళ్ళలేదు. కానీ, అతని ఉత్తరాల్లో అతను కన్పిస్తాడు. రెండు విభిన్న మనస్తత్వాల్ని నేను సమానంగా ఎలా అభిమానిస్తున్నానో!?

ఆ కళ్ళు మేడమీది నుండి గేటువైపుకు చూస్తున్నాయి. ఆ ఎదురు చూపులు పోస్ట్‌మన్ కోసం...పది రోజులుగా రాని ఏదో ఒక ఉత్తరం కోసం...ఆ ఉత్తరంలో తన భవిష్యత్తుకు వచ్చే జవాబుకోసం.

అంతరాత్మ చెప్పినట్లుగానే తను వ్రాసింది. ఇద్దరికీ వ్రాసింది. కానీ ఎవ్వరి దగ్గరినుండి జవాబు ఇప్పటివరకూ రాలేదు.

మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా, ఏదో ఒక రోజు ఆ మనిషి తనెప్పుడూ పట్టించుకొని మనిషికోసం ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ నిరీక్షించడం జరుగుతుంది.

అది ఎప్పుడో ఆమె ఏదో సినిమాలో చెప్పిన డైలాగు గుర్తొచ్చి నవ్వుకుంది.

విశాలి ఎంతో ఆత్రతగా ఎదురు చూస్తున్న పోస్ట్‌మన్ అప్పుడే వచ్చాడు. కొన్ని ఉత్తరాల్ని విశాలి పోస్ట్‌బాక్స్‌లో వేసి వెళ్ళిపోయాడు.

అది చూసి పరుగు పరుగున మేడ దిగింది.

ఆమె గుండెలోని ఆత్రత, కళ్ళలోని నిరీక్షణ ఆమె పరుగులో ప్రతిఫలించాయి. పోస్ట్‌బాక్స్ ఓపెన్ చేసి ఆ ఉత్తరాల కట్ట పట్టుకొని లాన్ లోకి పరుగు తీసింది. మెత్తని గడ్డిమీద, రంగు రంగుల అందమైన పూల మొక్కల మధ్య తల నిరబోసుకుని కూర్చొని ఉన్న విశాలి వనదేవతలా ఉంది.

ఉత్తరాల్ని గబగబా వెతుకుతున్న కళ్ళు, చేతులు ఒక ఉత్తరం దగ్గర ఆగిపోయాయి. ఎందుకో ఆమె చేతులు సన్నగా వణికాయి. ఒక్కసారి ఆగిన ఆత్రత మళ్ళీ మొదలై విశాలి ఆ ఉత్తరాన్ని విప్పింది. నిరీక్షణతో వేగలేని కళ్ళు అక్షరాల వెంట పడ్డాయి.

డియర్ విశాలి !

మీ ఉత్తరం అందింది. చదివి ఎంతో

ఆలోచించి వ్రాయడంవల్ల పెద్ద ఉత్తరం, ఆలస్యం అయ్యాయి. ఆ రోజు నేను మీ సన్మాన సభకు వద్దామని బయలుదేరి అక్కడకు వచ్చాను. కాని, నా దురదృష్టంవలన మీరు పంపిన ఇన్విటేషన్ కార్డు తేవడం మరచిపోయాను. ఎంత ప్రయత్నించినా లోపలకు రాలేకపోయాను. నాకున్న డబ్బు అక్కడేమీ ఉపయోగపడలేదు. మద్రాసులో నాకు తెలిసిన సినీ పరిశ్రమకు సంబంధించిన వాళ్ళుగానీ, ఇతర పెద్దవాళ్ళు గానీ ఎవ్వరూ లేరు. మీరు వచ్చేటప్పుడూ, వెళ్ళేటప్పుడూ మీ దగ్గరకు రావాలన్నా కుదరలేదు. ఎంతోమంది మనిద్దరి మధ్యా అడ్డుగా, ప్రవాహంలా ఉండిపోయారు. మీ సన్మానం అయిపోయాక నేను మీ ఇంటికి వచ్చాను. కానీ, మీరు లేరని, అప్పుడే షూటింగ్‌కు బెంగుళూరు వెళ్ళిపోయారని, వారం రోజుల వరకు రారని మీ అమ్మగారు చెప్పారు. ఏం చేస్తాను? బయట తగిలించి ఉన్న మీ అందమైన ఫోటోను చూసి వెళ్ళిపోయి తిరుగు రైలు ఎక్కేశాను.

అయ్యో! అప్పు డాయన ఎంత బాధపడి ఉంటారో అనుకుంది విశాలి.

మీ ఉత్తరంలోని 'ఆ' విషయాన్ని చదివి మొదట నే నాశ్చర్యపోయాను. ఆ తర్వాత పొంగిపోయి గెంతేశాను. నా అదృష్టానికి నేనే గర్వపడిపోయాను. ఓకే! మీ ఇష్టమే నా ఇష్టం. మీరు డబ్బు తేనక్కరలేదు. నాకు డబ్బుమీద ఆశ లేదు...తాళి కడతాను. నా భార్యగా నా తల్లిదండ్రులకు పరిచయం చేస్తాను. అప్పుడు వాళ్ళు సంతోషించరు. ఇంటిలో ఉండనియ్యరు కూడా! అందుకే నే నొకటి చేద్దామనుకుంటున్నాను... మీరు కాస్త ఎడ్జస్ట్ కావాలి. మేకప్ చేసుకున్న అమ్మాయిని నా తల్లిదండ్రులకి కోడలుగా చూపిస్తాను.

అలా అంటే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోనని కాదు...కానీ, నా కో ఆశ ఎప్పటినుండో ఉంది. అడుగుదామనుకున్న ఆశ ఉన్నా ఆ అవకాశం నాకు రాలేదు. కాబోయే భర్తగా చనువుతో, అభిమానంతో, అధికారంతో అడుగుతున్నాను. ఏ డైరెక్టర్నైనా, నిర్మాతల్నైనా పట్టుకొని నాకు హీరో వేషాలు ఇప్పించండి. హీరోగా నిలదొక్కుకున్నాక మిమ్మల్ని తప్పకుండా పెళ్ళి చేసుకుంటాను. అంతేకాదు. నా ఆస్తితో సహా మీ దగ్గరకు వచ్చేస్తాను.

ఈ నా నిర్ణయానికి కారణం సినిమా నటి మీద నమ్మకంలేని నా తల్లిదండ్రులు మాత్రమే!

ఇట్లు...మీ...సారీ...నీ సొంతం కాబోయే.

—కిరణ్!

ఉత్తరం చదివిన విశాలి గుండె జారిపోయింది. కిరణ్ ఇలా వ్రాశాడేమిటి? నన్ను...నన్ను...నిజంగా భార్యగా అంగీకరించాడా? సంఘానికి, తల్లిదండ్రులకు భార్యగా పరిచయం చేయడా?

అతని అభిమానం వెనుక ఆశ ఉందా? అందుకేనా అతను పరిచయం చేసుకున్నది? నాకు నచ్చని ప్రపంచం మీద అత నెంత మోజు పెంచుకున్నాడు? ఆ మోజును అభిమానంలా చూపించి నన్ను ఎంతగా మోసం చేశాడు?

ఆమె గజగజ వణికి పోయింది...

అంతరాత్మా! చెప్పు! నే నేం చేయాలి?

అంతరాత్మ నవ్వింది. ఎందు కంతలా భయపడిపోతావు? డబ్బున్న మామూలు మనిషనిపించుకున్నాడు కిరణ్. పోన్లే ఇంకా చైతన్య ఉన్నాడుగా. బీదవాడికి మంచి మనసుండే అవకాశం ఎక్కువ. అతనిమీద నాకు నమ్మకం ఉంది. ఆ మిగిలిన ఉత్తరాల్లో చైతన్య వ్రాసిన ఉత్తరం ఉందేమో చూడు!

విశాలి మిగిలిన ఉత్తరాలన్నింటినీ ఒక్కొక్కదాన్నీ గబగబా తీస్తూ చూసింది. ఆ కట్టలో చైతన్య ఉత్తరం లేదు.

• • •

భయంకర ప్రవాహాలకు ఆనకట్ట వేయగలడేమోగానీ, కాలప్రవాహానికి మాత్రం ఆనకట్ట వేయలేడు ఈ మనిషి.

అన్ని చూపుల కంటె ఎదురు చూపులే తీయన. నిరీక్షణలో బాధ ఉన్నా, ఆ బాధలో తీయదనం ఉంటుంది. ఆమె ఆ ఎదురు చూపులో, ఆ నిరీక్షణలో కూడా బాధ ఉంది. కానీ, అది తీయగా లేదు.

ఆ బాధలో భవిష్యత్తు మీద అనుమానం ఉంది. తన గడచిన కాలం మీద అసహ్యం ఉంది.

విశాలి కళ్ళు, మనసు, ఆలోచనలు అన్నీ ఎదురు చూస్తూనే ఉన్నాయి చైతన్య ఉత్తరం కోసం. వేధించిన అంతరాత్మ మాట్లాడ్డం మానేసింది. ఆమెలో ఆవేశం ఆగలేదు.

మాట్లాడవేం? నన్ను విమర్శించి, గేలి చేసే నీ నోరు పడిపోయిందా? చెప్పు! ఇప్పుడు నేనెలా బ్రతకాలి?

• • • •

విశాలి ఏడుస్తూంది. కన్నీటి ధారలు ధారావాహికంగా ప్రవహించగా, ఆమె గుండె అవిసిపోయేలా ఏడుస్తూంది.

ఆమె ఎన్నో సార్లు ఏడ్చింది. పాత్రల బాధల్ని గుండెలో నింపుకొని విలపించింది. ఆ పాత్రకు సంపూర్ణ న్యాయాన్ని చేకూర్చింది.

విశాలి అప్పుడు మంచి నటన కోసం ఏడ్చింది. ఇప్పుడు నిజమైన జీవితం కోసం ఏడుస్తూంది.

విశాలి సినిమాల్లో నటిస్తుంది. డబ్బు, బిరుదులు గడిస్తుంది. కానీ, తను నాశనం అయిపోయానని మాత్రం విలపిస్తూంది. గడిస్తున్న గౌరవాలు, బిరుదులు, డబ్బు—ఇవేమీ తన గతం గురించిన బాధను పోగొట్టలేక పోతున్నాయి.

అందిన కిరణ్ ఉత్తరం, అందని చైతన్య జవాబు ఆ బాధను రెట్టింపు చేస్తున్నాయి.

ఖాళీగా ఉన్న ప్రతి నిముషం ఎదురుచూస్తుంది చైతన్య ఉత్తరం కోసం.. చైతన్య కోసం కాకపోయినా, అంతరాత్మ తన జీవితానికి కావాలన్న మలుపును త్రిప్పే ఒక మనిషి కోసం ఎదురు చూస్తుంది.

మనిషి! మనిషంటే ఏమిటి? స్వార్థాల పుట్ట... ఆకర్షణల సమూహం.

కాలం వయసును పెంచి, ఆకర్షణను తగ్గించి, మోజును క్షీణింప జేస్తుంది.


ఇప్పుడు ఏ మనిషి ఏ ఆశా లేకుండా వస్తాడు ముందుకు...?

దేవుడు మనుష్యుల్ని సృష్టిస్తే ఈ మనుష్యులు సంఘాన్ని, స్వార్థాన్ని, కులాన్ని, మతాన్ని సిగ్గును, భయాన్ని, ఎగతాళిని, వెక్కిరింపును, అడ్డుగోడల్ని—ఇలా ఎన్నో సృష్టించుకున్నారు...

అలాంటి ప్రపంచంలో పెరిగిన మనిషి అన్నీ ఆలోచించి, అన్నింటినీ పట్టించుకుంటే విశాలిని ఆమె ప్రపంచంలోంచి అతని ప్రపంచంలోకి తీసుకు వెళ్ళడం కష్టమేమో!

ప్రతి నిరీక్షణకూ ఆఖరు నిముషం ఉంటుంది. ప్రతి నిరీక్షణకూ ఏదో ఫలితం ఉంటుంది. ఆ ఫలితం ఆ నిరీక్షించిన మనిషి అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది. ఇవి సుందరి రామారావు వస్తానన్న రాత్రి అతని కోసం నిరీక్షిస్తున్న సమయంలో మనసులో అనుకున్న మాటలు.

మరి నా నిరీక్షణకు ఫలితం ఏమిటో!? నా అదృష్టం ఎలా ఉందో!?




నీ కెందుకు, నేనున్నాను. నేను చెప్పినట్టు చేస్తే అసలైన అర్థమున్న జీవితం దక్కుతుందన్నావు. అందమైన మలుపు తిరుగుతుందన్నావు. ఆ మలుపులో ఆనందం అంతా ఇంతా కాదన్నావు. అస లా మలుపేది? నా జీవితంలో మార్పు ఎక్కడ? అసలు నా జీవితానికి అర్థం ఏమిటి? నువ్వన్న ఆ జీవితాని కున్న అర్థమేమిటి? ఎక్కడా అసలైన అర్థమున్న జీవితం? ఏదీ, నన్ను నిజంగా అభిమానించే మనుష్యులేరీ? అని అంతరాత్మని అడిగింది. మరీ మరీ మరీ అడిగింది. వేధించింది, సోదించింది. ఏడ్చింది.

"...." అంతరాత్మ ఏమీ మాట్లాడలేదు.

అడిగి అడిగి అలసి పోయి, విసిగి వేసారి పోయింది విశాలి. అంతరాత్మ 'హమ్మయ్య' అనుకుంది. నేనేం సమాధానం చెప్పాలి అనుకొని దడదడ లాడుతున్న అంతరాత్మ గుండె మామూలు స్థాయికి చేరుకుంది.

ఇప్పుడు విశాలికి, ఆమె అంతరాత్మకు మధ్య ఉన్నది చిక్కని నిశ్శబ్దం మాత్రమే! ✱